

కాలువలోకి వ్యర్థ రసాయనాలు

పిలాయిపల్లి కాలువలో వ్యర్థ రసాయనాలు పారబోస్తున్న ట్యాంకర్‌ను పోలీసులు పట్టుకున్నారు. - 8లో



పాలస్తీనా జెండాల ప్రదర్శన

మిర్యాలగూడలో కొందరు యువకులు పాలస్తీనా దేశపు జెండాలు ప్రదర్శించడం చర్చనీయాంశంగా మారింది. - 8లో



జన్మభూమికి అంకితం

తనకు వచ్చిన ప్రతి అవార్డు కన్నతల్లిలాంటి వెల్లంకి గ్రామానికి అంకితం చేస్తున్నట్లు కూరెళ్ల విఠలాచార్య తెలిపారు. - 10లో

న్యూస్‌రీల్

కూరెళ్ల విఠలాచార్య భావితరాలకు మార్గదర్శకం

భువనగిరి టౌన్ : సాహిత్యమే ఊపిరిగా ఐదు దశాబ్దాలుగా రచనలు చేస్తున్న కూరెళ్ల విఠలాచార్య భావితరాలకు మార్గదర్శకం అని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ పేర్కొన్నారు. కూరెళ్ల విఠలాచార్యకు పద్మశ్రీ అవార్డు రావడంపై శుక్రవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. తన ఇంటిని గ్రంథాలయంగా మార్చి లక్షలాది పుస్తకాలు సమకూర్చడం ఎంతో గొప్ప విషయమన్నారు. ఎంతోమంది పరిశోధక విద్యార్థులు నేడు కూరెళ్ల గ్రంథాలయం బాట పడుతున్నారని పేర్కొన్నారు. సీపీఎం జిల్లా కమిటీ తరఫున కూరెళ్ల విఠలాచార్యకు అభినందనలు తెలిపారు. అభినందనలు తెలిపిన వారిలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కొండమడుగు నరసింహ, బట్టుపల్లి అనురాధ, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మంగ నరసింహులు, మాటూరు బాలరాజు, కల్లూరు మల్లేశం, దాసరి పాండు, మేక అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

తాళ్లసింగారం యువకుడికి ఇన్నోవేషన్ అవార్డు

చౌటుప్పల్ : మున్సిపాలిటీ పరిధిలోని తాళ్లసింగారం గ్రామానికి చెందిన యువకుడు తోటకూర ప్రవీణ్‌కు విలేజ్ ఇన్నోవేషన్ అవార్డు లభించింది. ప్రవీణ్ పదవ తరగతి వరకే చదివినప్పటికీ రైతులకు ఉపయోగపడేలా తక్కువ ఖర్చుతో ఆటోమేటిక్ స్ప్రేయర్లు, పౌల్ట్రీ రైతులకు వివిధ రకాల ఆటోమెటిక్ యంత్రాలు తయారు చేశాడు. ఇందుకు గాను తెలంగాణ రాష్ట్ర ఇన్నోవేషన్ సెల్ (టీఎస్ఐసీ) ఆధ్వర్యంలో 2024 సంవత్సరానికి ప్రవీణ్‌ను పురస్కారానికి ఎంపిక చేశారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని టీఎస్ఐసీ పంపించిన అవార్డును మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు మున్సిపల్ కార్యాలయంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సోలిపురం భాస్కర్‌రెడ్డి, కౌన్సిలర్ బత్తుల రాజ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి నెల వేతనం పేదలకే : ఎమ్మెల్యే ఐలయ్య

సాక్షి,యాదాద్రి : తన జీతాన్ని ప్రతి నెల పేద ప్రజల కోసం ఖర్చు పెడతానని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ప్రకటించారు. శుక్రవారం ఆయన భువనగిరి పట్టణంలో గణతంత్ర వేడుకల్లో పాల్గొని మాట్లాడారు. మొదటి నెల జీతంతో ఆలేరు నియోజకవర్గంలో ఉన్న అన్ని జడ్పీహెచ్ఎస్ పాఠశాలల విద్యార్థులందరికీ పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేశామని తెలిపారు. అదేవిధంగా ప్రతి నెల వచ్చే జీతంలో తొమ్మిది రూపాయలు ఉంచుకొని (అదృష్ట సంఖ్య తొమ్మిది) మిగతా జీతాన్ని పేద ప్రజల కోసం వినియోగిస్తానని హామీ ఇచ్చారు.

యాదాద్రిలో ఊంజలి సేవ



ఊంజలి సేవను ఊరేగిస్తున్న ఆచార్యులు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి క్షేత్రంలో శుక్రవారం ఊంజలి సేవ వైభవంగా నిర్వహించారు. ఆండాళ్‌దేవిని ప్రత్యేకంగా అలంకరించి ఆలయ మాఢ వీధుల్లో ఊరేగించారు. అమ్మవారి సేవకు మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికారు. అనంతరం అద్దాల మండపంలో అమ్మవారిని అధిష్టించి ఊంజలి సేవ నిర్వహించారు. అంతకుముందు వేకువజామున ప్రధానాలయాన్ని తెరిచిన ఆచార్యులు.. శ్రీస్వామి, అమ్మవారికి సుప్రభాత సేవ చేపట్టారు. అనంతరం అభిషేకం, అర్చనలు జరిపించారు. ఇక ఆలయ ముఖ మండపం, ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శనహోమం, నిత్యకల్యాణం, జోడు సేవలు తదితర కైంకర్యాలు గావించారు.

రాజ్యాంగ విశిష్టతను తెలియజేయడానికే యాత్ర



యాత్రలో ధర్మసమాజ్ పార్టీ నాయకులు

భువనగిరిటౌన్ : రాజ్యాంగాన్ని రక్షించుకుంటే అది మనల్ని కాపాడుతుందని ధర్మ సమాజ్ పార్టీ జిల్లా కన్వీనర్ నల్ల నరేందర్ పేర్కొన్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ధర్మ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం భువనగిరిలో భారత రాజ్యాంగ యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజ్యాంగ విశిష్టతను ప్రజలకు తెలియజేయడానికే రాజ్యాంగయాత్ర నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంజేఎస్, ధర్మ సమాజ్ పార్టీ నాయకులు శ్రీశైలం, చంద్రపాల్, మహేష్, లింగస్వామి, లింగస్వామి, సంజీవ, వినోద్ యాదవ్, రాకేష్, మహేష్, శ్రీకాంత్, మహేష్, వెంకటేష్ పాల్గొన్నారు.

అభివృద్ధికి పాటుపడదాం



భువనగిరిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో జాతీయ పతాకాన్ని ఎగురవేసి సెల్యూట్ చేస్తున్న కలెక్టర్ హనుమంతు కె.జెండగే



> మహాలక్ష్మి పథకం ద్వారా జిల్లాలో 8.51లక్షల మంది మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణం చేశారు. మిగతా ఐదు గ్యారంటీల అమలుకు ప్రజాపాలన ద్వారా 2,68,790 దరఖాస్తులు స్వీకరించి ఆన్‌లైన్ చేశాం.
>
> –కలెక్టర్ హనుమంతు కె.జెండగే

- ప్రతి ఒక్కరూ కలిసిరావాలి
- అర్హులందరికీ ఆరు గ్యారంటీలు
- ఫ్రెండ్లీ పోలీసింగ్‌లో రాష్ట్రానికే ఆదర్శం
- గణతంత్ర వేడుకల్లో కలెక్టర్ హనుమంతు కె.జెండగే



భువనగిరిలో జాతీయ జెండాకు సెల్యూట్ చేస్తున్న ఎమ్మెల్యేలు ఐలయ్య, అనిల్‌కుమార్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి, డీసీపీ రాజేశ్‌చంద్ర, అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు, అధికారులు

సాక్షి,యాదాద్రి : జిల్లా అభివృద్ధి కోసం సమన్వయంతో పాటుపడదాం అని కలెక్టర్ హనుమంతు కె.జెండగే పిలుపునిచ్చారు. 75వ గణతంత్ర వేడుకలను శుక్రవారం భువనగిరిలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జాతీయ జెండా ఎగురవేసి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం జిల్లా అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి తన ప్రసంగం ద్వారా వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను పకడ్బందీగా అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మహాలక్ష్మి పథకం ద్వారా యాదాద్రి జిల్లాలో ఇప్పటి వరకు 8.51లక్షల మంది ఉచితంగా ప్రయాణం చేసినట్లు వెల్లడించారు. మిగతా ఐదు గ్యారంటీల అమలుకు ప్రజాపాలనలో 2,68,790 దరఖాస్తులు స్వీకరించి ఆన్‌లైన్ చేసినట్లు తెలిపారు. వానాకాలం సీజన్‌లో 2.63 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని చెప్పారు. స్వయం సహాయక సంఘాలకు ఈ ఆర్థిక సంవత్సరం రూ.511 కోట్ల 86 లక్షల రుణాలు ఇవ్వాలని నిర్ణయించి రూ.440 కోట్ల 63 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. 1,02,806 మందికి ప్రతి నెలా పింఛన్ అందజేస్తున్నట్లు వివరించారు. ఎస్డీఎఫ్ నిధులు రూ.32.30కోట్లతో చేపట్టిన వంతెనలు, రోడు పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. ఆలేరులో రైల్వే అండర్ బ్రిడ్జి పనులు జరుగుతున్నాయన్నారు. ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన (పీఎంజీఎస్‌వై) కింద రూ.63 కోట్లతో 16 ప్రాంతాల్లో రోడ్లు, ఐదు వంతెనలు నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. మినరల్ ఫండ్ ద్వారా 673 పనులకు 424 పూర్తయ్యాయని చెప్పారు. అగ్నిప్రమాదాల నివారణకు అధునాత వాహనాలను అందుబాటులో ఉంచినట్లు స్పష్టం చేశారు.



పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న కలెక్టర్



భువనగిరిలో విద్యార్థినుల నృత్య ప్రదర్శన

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

భువనగిరిలోని విజ్ఞాన్ హైస్కూల్, తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్, క్రిష్ణవేణి హైస్కూల్, అనంతారం జెడ్పీహెచ్ఎస్, బొమ్మల రామారం కేజీబీవీ, బీఎన్ తిమ్మాపురం జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, జిల్లా పరిషత్ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, డీసీపీ రాజేశ్‌చంద్ర, అదనపు కలెక్టర్లు వీరారెడ్డి, భాస్కర్‌రావు, స్వాతంత్ర్య సమరయోధులు, సీనియర్ సిటిజన్లు, ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు

ఫ్రెండ్లీ పోలీసింగ్‌లో రాచకొండ పోలీసులు రాష్ట్రానికే ఆదర్శంగా నిలిచారని కలెక్టర్ కొనియాడారు. నేరాల నియంత్రణ కోసం అన్ని గ్రామాలు, పట్టణాల్లోని ప్రధాన కూడళ్లలో 15,102 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పాలనను ప్రజలకు మరింత చేరువగా తీసుకెళ్లడంతో పాటు అర్హులందరికీ ప్రభుత్వ ఫలాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని, ఇందుకు సహకరిస్తున్న ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. అంతకు ముందు కలెక్టరేట్‌లో కలెక్టర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.



వానాకాలం సీఎంఆర్ పూర్తి

- 99.50 శాతం సేకరణ

సాక్షి,యాదాద్రి : 2022–23 వానాకాలానికి సంబంధించి కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) సేకరణ పూర్తయినట్లు కలెక్టర్ హనుమంతు కె.జెండగే, అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు శుక్రవారం సంయుక్త ప్రకటనలో తెలిపారు. సీఎంఆర్ కోసం 44 మంది మిల్లర్లకు ధాన్యం ఇచ్చామని, 99.50శాతం బియ్యం సేకరణ పూర్తి చేశామన్నారు. 1,90,333 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని తుది గడువులోగా సేకరించినట్లు వివరించారు. సకాలంలో సీఎంఆర్ ఇవ్వనందుకు గాను గుండాల మండలంలోని లక్ష్మీనారాయణరెడ్డి బిన్నీ రైస్ మిల్‌పై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. లక్ష్మీనారాయణరెడ్డి మిల్లు నిర్వాహకులు 1,150 మెట్రిక్ టన్నుల బియ్యం ప్రభుత్వానికి బకాయి పడ్డారని, సకాలంలో అందజేయకపోవడంతో 25 శాతం పెనాల్టీతో కలిపి రూ.5.23 కోట్లు ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉందన్నారు. మిల్లు నిర్వాహకులపై క్రిమినల్ కేసు, సొమ్మును రాబట్టడానికి తగిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

యాసంగి సీఎంఆర్ 40 శాతం..

యాసంగి బియ్యం సేకరణ 40 శాతం పూర్తయిందని కలెక్టర్, అదనపు కలెక్టర్ తెలిపారు. మిగతా సీఎంఆర్‌ను కూడా సకాలంలో అందజేసి జిల్లాను రాష్ట్రంలో ముందంజలో ఉంచాలని మిల్లర్లకు, అధికారులకు సూచించారు.

31న తిమ్మాపురం గ్రామానికి ప్రారంభోత్సవం

- ఫిబ్రవరిలోపు అన్ని వసతులు కల్పిస్తాం
- ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి



బీఎన్‌తిమ్మాపురం గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

భువనగిరిటౌన్ : బీఎన్ తిమ్మాపురం నూతన గ్రామాన్ని ఈనెల 31న ప్రారంభించనున్నట్లు ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. బీఎన్ తిమ్మాపురం గ్రామస్తులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కింద భువనగిరి శివారులోని హుస్నాబాద్‌లో కేటాయించిన ప్లాట్లను శుక్రవారం ఆయన పరిశీలించారు. గ్రామ నిర్మాణం, వసతులపై అధికారుల ద్వారా తెలుసుకున్నారు. పంచాయతీల పాలకవర్గాల పదవీకాలం ఫిబ్రవరి 1న ముగియనున్న నేపథ్యంలో 31వ తేదీన గ్రామాన్ని ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఫిబ్రవరిలోగా రోడ్లు, విద్యుదీకరణ, మంచినీరు తదితర సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. నీటి లభ్యత తక్కువగా ఉన్నందున పక్కనే ఉన్న కాలువ నుంచి సరఫరా చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. బీఎన్‌తిమ్మాపురం నిర్వాసితులకు అన్ని ప్యాకేజీలు కలిపి ఇంకా రూ.200 కోట్లు కావాల్సి ఉందని, ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. గజ్వేల్, కొండపోచమ్మ ప్రాజెక్టు నిర్వాసితులకు గత ప్రభుత్వం ఎక్కువ పరిహారం చెల్లించి బస్వాపురం బాధితులను విస్మరించిందన్నారు. నిర్వాసితులకు అన్నివిధాలా అండగా ఉంటానని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు, భువనగిరి ఆర్డీఓ అమరేందర్, తహసీల్దార్ అంజిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ భట్టు నాగిరెడ్డి, నాయకులు ఉన్నారు.

పార్లమెంట్ ఎన్నికలకు సిద్ధం కావాలి

- డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న మహేందర్‌రెడ్డి

యాదగిరిగుట్ట రూరల్ : పార్లమెంట్ ఎన్నికలకు సిద్ధం కావాలని పార్టీ శ్రేణులకు డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం యాదగిరిగుట్ట మండలంలోని వంగపల్లి పీఏసీఎస్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. అధిష్టానం నిర్ణయించిన వ్యక్తిని గెలిపించేందుకు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు బాధ్యతాయుతంగా పని చేయాలని కోరారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో రెండు సీట్లను కైవసం చేసుకోవడమే లక్ష్యంగా పని చేయాలన్నారు. ప్రజల్లో కేసీఆర్‌పై ఉన్న అభిమానం చెక్కు చెదరలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలు ఆలోచనలో పడ్డారని పేర్కొన్నారు. పట్టభద్రుల ఎన్నికలకు గ్రాడ్యుయేట్‌లు ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు.

29న జాతీయ అవార్డు స్వీకరణ

బెస్ట్ ప్రెసిడెంట్ పర్‌ఫామెన్స్ అవార్డు ఫర్ కోఆపరేటివ్ బ్యాంక్ డెవలప్‌మెంట్ అవార్డును ఈ నెల 29వ తేదీన ఢిల్లీలో అందుకోనున్నట్లు గొంగిడి మహేందర్‌రెడ్డి తెలిపారు. సహకార బ్యాంకుల అభివృద్ధి కోసం అందించిన సేవలకు గాను అవార్డు లభించిందన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్లు ఇమ్మడి రాంరెడ్డి, మొగులగాని మల్లేశం గౌడ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గడ్డమీది రవీందర్ గౌడ్, మండల పార్టీ అధ్యక్షుడు కర్రె వెంకటయ్య, చంద్రగాని జహంగీర్‌గౌడ్, ఉపసర్పంచ్‌ల ఫోరం జిల్లా అధ్యక్షుడు రేపాక స్వామి, ఎండీ అజ్జు, సీస శేఖర్, బీర్ల మహేష్, కానుగు బొట్టురాజు గౌడ్, యడపల్లి మహేష్ పాల్గొన్నారు.

ప్రత్యేక పాలనకు సన్నాహాలు

- అధికారుల జాబితా సిద్ధం
- పంచాయతీ సెక్రటరీ, ప్రత్యేకాధికారికి జాయింట్ చెక్‌పవర్
- ఫిబ్రవరి 1వ తేదీతో ముగియనున్న సర్పంచ్‌ల పదవీకాలం



రామన్నపేట : గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక అధికారుల పాలనకు యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. సర్పంచ్‌ల పదవీకాలం మరో వారం రోజుల్లో ముగియనుండడంతో ప్రత్యేకాధికారులను నియమించేందుకు జాబితా సిద్ధం చేస్తోంది. జిల్లాలో 421 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. 2019 జనవరి 25న ఎన్నికలు జరిగాయి. ఫిబ్రవరి 2న కొత్తపాలక వర్గాలు కొలువుదీరాయి. ఫిబ్రవరి 1తో సర్పంచ్, వార్డుసభ్యుల పదవీ కాలం ముగియనుంది. ఆరు గ్యారంటీ పథకాల అమలు, లోక్‌సభ ఎన్నికలపై దృష్టి సారించిన రాష్ట్ర ప్రభుత్వం.. పంచాయతీ ఎన్నికల నిర్వహణపై చర్యలు చేపట్టలేదు. ఫిబ్రవరి రెండవ వారంలో లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ వెలువడే అవకాశాలు ఉన్నాయి. తక్కువ వ్యవధిలో పంచాయతీల ఎన్నికలకు సంబంధించిన వార్డుల విభజన, సిబ్బంది నియామకం, నోటిఫికేషన్, నామినేషన్లు, ప్రచారం, ఓటింగ్ ప్రక్రియను నిర్వహించేందుకు సాధ్యం కాదు. ఈ నేపథ్యంలో సర్పంచ్‌ల పదవీకాలం పొడగించకుండా ప్రత్యేకాధికారులను నియమించడానికే ప్రభుత్వం మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తుంది. 2013లోనూ అప్పటి ప్రభుత్వం ఆరునెలల పాటు ప్రత్యేకాధికారులను నియమించిన విషయం తెలిసిందే.

మండలస్థాయి అధికారులకు బాధ్యతలు

మండలస్థాయి అధికారులను పంచాతీయలకు ప్రత్యేకాధికారులుగా నియమించనున్నారు. గెజిటెడ్ హోదా కలిగిన తహసీల్దార్, ఎంపీడీఓ, డిప్యూటీ తహసీల్దార్, ఎంపీఓ, సీడీపీఓ, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, ఇరిగేషన్ ఏఈలు, వ్యవసాయాధికారి, వైద్యాధికారులను మేజర్ గ్రామ పంచాయతీల బాధ్యతలు అప్పగిస్తారు. చిన్న గ్రామ పంచాయతీలకు ఆర్ఐ, సీనియర్ అసిస్టెంట్, సూపరింటెండెంట్, ఏపీఎం, ఏపీఓ, వ్యవసాయ విస్తరణ అధికారులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లను నియమించే అవకాశం ఉంది. సిబ్బంది వేతనాల చెల్లింపు, మంచినీటి సరఫరా, పారిశుద్ధ్యం మెరుగు, వీధిదీపాల నిర్వహణ, పన్నులు వసూలు చేయవలసి ఉంటుంది. ప్రత్యేక అధికారి, పంచాయతీ కార్యదర్శికి జాయింట్ చెక్‌పవర్ ఉంటుంది.

బిల్లులు రాక ఆందోళనలో సర్పంచ్‌లు

గ్రామాల్లో సర్పంచ్‌లు వివిధ రకాల పనులు చేపట్టారు. పల్లెప్రగతిలో ప్రజల అవసరాలు తీర్చడానికి చేపట్టిన పనులకు సంబంధించిన బిల్లులు రావలసి ఉన్నది. ఎంబీలు కాక, గ్రామ పంచాయతీల ఖాతాల్లో డబ్బులు లేక చేసిన పనులకు బిల్లులు రాలేదు.ఓవైపు పదవీకాలం ముగుస్తుండడం, మరోవైపు బిల్లులు రాకపోవడంతో సర్పంచ్‌లు ఆందోళన చెందుతున్నారు.

నేడు ఆలేరు మున్సిపల్ చైర్మన్‌పై అవిశ్వాసం

ఆలేరు రూరల్ : ఆలేరు మున్సిపల్ చైర్మన్ వస్పరి శంకరయ్యపై అవిశ్వాసానికి రంగం సిద్ధమైంది. మున్సిపాలిటీలో 12 మంది కౌన్సిలర్లు ఉండగా 8 మంది అవిశ్వాస తీర్మానంపై సంతకాలు చేసి ఈనెల 9వ తేదీన కలెక్టర్‌కు అందజేశారు. కాగా బల నిరూపణ కోసం శనివారం మున్సిపల్ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయనున్నారు. ఉదయం 11 గంటలకు ఆర్డీఓ అమరేందర్ ఆధ్వర్యంలో సమావేశం జరగనుంది. ఇదిలా ఉండగా సమావేశానికి ఎనిమిది మంది కౌన్సిలర్లు తప్పనిసరిగా హాజరుకావల్సి ఉంది. క్యాంపులో ఉన్న కౌన్సిలర్లు సమావేశానికి గైర్హాజరయ్యే అవకాశాలు ఉన్నట్లు సమాచారం.

బీజేపీని ఓడించడమే లక్ష్యం

- ఎస్‌కేఎం జిల్లా కన్వీనర్ రాజయ్య



భువనగిరిలో ర్యాలీ నిర్వహిస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

భువనగిరిటౌన్ : రైతు, కార్మిక వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న బీజేపీని పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించడమే లక్ష్యమని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) జిల్లా కన్వీనర్ కొల్లూరి రాజయ్య అన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ ఫిబ్రవరి 16న తలపెట్టిన దేశవ్యాప్త గ్రామీణ బంధు సమ్మెను జయప్రదం చేయాలని ఎస్‌కేఎం జాతీయ కమిటీ పిలుపు మేరకు శుక్రవారం భువనగిరిలో ట్రాక్టర్లు, బైక్‌లతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ సర్కార్ కార్పొరేట్, మతోన్మాద విధానాలు అవలంభిస్తుందని, తద్వారా కార్మికులు, రైతులతో పాటు అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 44 చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా కేంద్రం విభజించిందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి గుణపాఠం తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐకేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మాటూరి బాలరాజ్, రైతు సంఘం జిల్లా నాయకులు బట్టు రామచంద్రయ్య, తెలంగాణ రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి కెవిడి ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు.





‘జన’పహాడ్

సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలం జాన్‌పహాడ్ సైదన్న ఉర్సుకు రెండో రోజు శుక్రవారం తరలివచ్చిన భక్తులు, దర్గాలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి


భువనగిరి పట్టణంలోని పరేడ్ గ్రౌండ్‌లో పరేడ్ చేస్తున్న పోలీసులు


గణతంత్ర వేడుకల్లో పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న కలెక్టర్ హనుమంతు కె. జెండగే


గణతంత్ర వేడుకల్లో భాగంగా నృత్య ప్రదర్శన చేస్తున్న విద్యార్థినులు


యోగా విన్యాసాలు చేస్తున్న విద్యార్థులు

ఉత్తమ సేవలకు అవార్డులు

భువనగిరిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో శుక్రవారం నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో జాతీయ జెండాను కలెక్టర్ హనుమంతు కె జెండగే ఎగురవేశారు. అనంతరం ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డితో కలిసి ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందజేశారు.

– భువనగిరి


ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, కలెక్టర్ హనుమంతు కె జెండగే చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న డీపీఓ ఆర్. సునంద


వెంకటరమణ, ఏడీ మైన్స్, యాదాద్రి


వి. శేఖర్‌రెడ్డి, ఎస్‌డీసీ, యాదాద్రి


నాగేశ్వరాచారి, ఎలక్షన్ సూపరింటెండెంట్


సయ్యద్ సాజిద్, డీటీ, భువనగిరి ఆర్డీఓ ఆఫీస్


కల్పన, డిప్యూటీ తహసీల్దార్, తుర్కపల్లి


దివ్య, సీనియర్ అసిస్టెంట్


కోటయ్య, ఆఫీస్ సబార్డినేట్, కలెక్టరేట్ | ఖాజా ఫసియొద్దీన్, సర్వేయర్, ఏడీ, ఎస్ఎల్ఆర్ | కేపీ రాజేశ్వరి, సీనియర్ అసిస్టెంట్, డీఆర్‌డీఓ | కె. కృష్ణప్రసాద్, సీఐ ఇంటెలిజెన్స్, రాచకొండ | ఇ. మహేష్, ఇంటెలిజెన్స్ ఫీల్డ్ ఆఫీసర్, భువనగిరి | వి. గణేష్, ఇంటెలిజెన్స్ ఫీల్డ్ ఆఫీసర్, ఆలేరు | బుర్రి రఘువర్ధన్‌రెడ్డి, టైపిస్ట్, ఎక్సైజ్ శాఖ | జి. సత్తమ్మ, పీహెచ్ఎన్, పీహెచ్‌సీ, వర్కటపల్లి | చిన్నానాయక్, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ | బి. స్వప్న, డిప్యూటీ సీఎస్, జిల్లా ఆస్పత్రి | కె. చిరంజీవి అర్జున్‌రాజ్, మైక్రోబయాలజిస్ట్, టీ-హబ్ | హెచ్. దెబోరారాణి, స్టాఫ్ నర్సు, జిల్లా ఆస్పత్రి | వరప్రసాద్, అటెండర్, జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి


ఎం. రమేష్, డీఈఓ సూపరింటెండెంట్, జిల్లా ఆస్పత్రి | పద్మ, ఎఫ్ఎన్ఓ, సీహెచ్‌సీ, రామన్నపేట | సుభాషిణి, హెడ్ నర్సు, సీహెచ్‌సీ, ఆలేరు | నీరజ, జూనియర్ అసిస్టెంట్, డీపీఓ ఆఫీస్ | శైలజ, సీనియర్ ఇన్‌స్పెక్టర్, కోఆపరేటివ్ కార్యాలయం | అబ్దుల్ జబ్బార్, జూనియర్ అసిస్టెంట్, కోఆపరేటివ్ ఆఫీస్ | ఎన్. ప్రశాంత్‌రెడ్డి, అసిస్టెంట్ డైరెక్టర్, డీఈఓ ఆఫీస్ | రాజన్‌బాబు, యాదాద్రి దేవస్థానం సూపరింటెండెంట్ | రవివర్మ, జూనియర్ అసిస్టెంట్, డీఎస్‌సీడీఓ | సంజీవరెడ్డి, పబ్లిసిటీ అసిస్టెంట్, డీపీఆర్ఓ ఆఫీస్ | జంగయ్య, డీఐ ఆఫీస్ సూపరింటెండెంట్ | రామయ్య, డిప్యూటీ సూపరింటెండెంట్, ఆర్టీసీ | వీకే రెడ్డి, డ్రైవర్, డీఎం, ఆర్టీసీ


ఎం. లింగస్వామి, మెకానిక్, ఆర్టీసీ | చిరందాసు స్వాతికిరణ్, ఏఈఈ, భువనగిరి | ప్రశాంతి, ట్రాన్స్‌పోర్ట్ కానిస్టేబుల్, డీటీఓ ఆఫీస్ | గాదె యాదగిరి, పబ్లిక్ హెల్త్ ఆఫీసర్ భువనగిరి మున్సిపల్ ఆఫీస్ | ఎడ్ల శ్రీకాంత్, కంప్యూటర్ ఆపరేటర్, మోత్కూరు మున్సిపల్ ఆఫీస్ | కొండమడుగు కిష్టయ్య, స్వీపర్, పోచంపల్లి మున్సిపల్ ఆఫీస్ | ఎరిగె వాణి, స్వీపర్, చౌటుప్పల్ మున్సిపల్ ఆఫీస్ | జె. యాదగిరి, బిల్ కలెక్టర్, ఆలేరు మున్సిపల్ ఆఫీస్ | జె. రాకేష్, ఏఈఈ, యాదగిరిగుట్ట | జి. సతీష్‌గుప్తా, ఏఈఈ, భువనగిరి | పి. రంగారావు, సీనియర్ అసిస్టెంట్, డిప్యూటీ ఈఈ, యాదగిరిగుట్ట | ఆర్. లక్ష్మీపతి, హెల్పర్, గ్రేడ్-1 ఈఈ, భువనగిరి | ఆర్. హరినాథ్‌రెడ్డి, డీఎల్ఎంటీ, ఆలేరు జెడ్పీహెచ్ఎస్


కె. నర్సిరెడ్డి, డీఎల్ఎంటీ, భువనగిరి ఎంపీపీఎస్ | సీహెచ్. చిత్రాంజన్, ఏఎల్ఎంటీ, ఎంపీపీఎస్, ఆత్మకూర్ | డి. దానమ్మ, ఫార్మసిస్ట్, జిల్లా హోమియో ఆస్పత్రి | సువర్ణ, కమ్యూనిటీ ఆర్గనైజర్, మెప్మా, యాదాద్రి | వేణుగోపాల్, ఇన్‌స్పెక్టర్, ఎస్‌బీ, భువనగిరి | షేక్ ఖుర్షీద్, సీనియర్ అసిస్టెంట్, సీపీఓ, రాచకొండ | సురేష్, హోంగార్డు, భువనగిరి ట్రాఫిక్ పీఎస్ | బీకునాయక్, ఏఆర్ హెచ్‌సీ, హెడ్‌క్వార్టర్స్, భువనగిరి | పాండరి, పీసీ, హెడ్‌క్వార్టర్స్, భువనగిరి | ఇ. శివకుమార్, ఏఎస్ఐ, ఫింగర్ ప్రింట్ | జె. విజయ్, హెచ్‌సీ, సీసీఆర్‌బీ, రాచకొండ | ఎం. విక్రమ్‌రెడ్డి, ఎస్ఐ పోచంపల్లి | ఎం. రాజు, పీసీ, బొమ్మలరామారం పీఎస్

పిలాయిపల్లి కాలువలోకి వ్యర్థ రసాయనాలు

- ట్యాంకర్‌లో తీసుకొచ్చి వదులుతుండగా పట్టుకున్న పోలీసులు
- ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు


పోలీసులు పట్టుకున్న రసాయన వ్యర్థాలను తరలిస్తున్న ట్యాంకర్ ఇదే..

భూదాన్‌పోచంపల్లి: పోచంపల్లి మండల శివారులోని మైసమ్మ కత్వ సమీపంలో గల పిలాయిపల్లి కాలువలోకి గురువారం అర్ధరాత్రి గుట్టుచప్పుడు కాకుండా వ్యర్థ రసాయనాలు పారబోస్తున్న కెమికల్ ట్యాంకర్‌ను పోలీసులు పట్టుకున్నారు. స్థానిక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పోచంపల్లి మున్సిపాలిటీ కేంద్రం నుంచి కొత్తగూడెం గ్రామానికి వెళ్లే రోడ్డులో మైసమ్మ కత్వ సమీపంలో గల పిలాయిపల్లి కాలువ వద్ద గురువార అర్ధరాత్రి కొందరు వ్యక్తులు ట్యాంకర్‌ను ఆపి వ్యర్థ రసాయనాలను కాలువలోకి వదులుతుండగా రాత్రి సమయంలో పెట్రోలింగ్ చేస్తున్న పోలీస్ కానిస్టేబుళ్లు సాయికుమార్, వినోద్‌కుమార్ గమనించారు. వెంటనే దగ్గరికి వెళ్లి చూడగా ఘాటైన దుర్వాసన వస్తుండటంతో ఇక్కడ ఏం చేస్తున్నారని ప్రశ్నిస్తుండగా రసాయనాలు పారబోస్తున్న వారు అక్కడి నుంచి పారిపోయే ప్రయత్నం చేశారు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు అటుగా వెళ్తున్న పోచంపల్లికి చెందిన ఆదిమూలం శ్రీనివాస్, నోముల పాండుతో పాటు మరో ఇద్దరు వాహనదారుల సహాయంతో కెమికల్ ట్యాంకర్ డ్రైవర్‌తో పాటు ఇన్నోవా క్రిస్టా కారులో వచ్చిన మరో వ్యక్తిని పట్టుకున్నారు. అనంతరం ట్యాంకర్, కారును పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అయితే కారులో వచ్చిన వ్యక్తిని పోలీసులు ప్రశ్నించగా.. తన పేరు తానం సంపత్‌రెడ్డి అని మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కుత్బుల్లాపూర్ మండలం సూరారం కాలనీలో నివాసముంటున్నట్లు తెలిపాడు. అదేవిధంగా ట్యాంకర్ డ్రైవర్ బిహార్ రాష్ట్రానికి చెందిన దీపుయాదవ్‌గా గుర్తించారు. అయితే వీరు హైదరాబాద్‌లోని జీడిమెట్ల పారిశ్రామిక ప్రాంతాల నుంచి ట్యాంకర్లలో వ్యర్థ రసాయనాలను ఇక్కడకు తీసుకొచ్చి పిలాయిపల్లి కాలువలో పారబోస్తున్నట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. వీరు ఎవరికీ అనుమానం కలుగకుండా పెట్రోల్ ట్యాంకర్‌ను పోలిన ట్యాంకర్లలో వ్యర్థ రసాయనాలను తరలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోచంపల్లి పోలీస్ స్టేషన్ ఎస్ఐ విక్రమ్‌రెడ్డి తెలిపారు.

మానవత్వం చాటుకున్న ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య


క్షతగాత్రులను ఆస్పత్రికి తరలిస్తున్న బీర్ల ఐలయ్య

భువనగిరి క్రైం: భువనగిరి మున్సిపాలిటీ పరిధిలోని బైపాస్‌లో రోడ్డులో శుక్రవారం ఉదయం ఇద్దరు యువకులు బైక్‌పై హైదరాబాద్ వెళ్తూ ప్రమాదవశాత్తు అదుపు తప్పి పడిపోయారు. అదే సమయంలో గణతంత్ర వేడుకల్లో పాల్గొనడానికి భువనగిరికి వెళ్తున్న ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య వారిని చూసి తన వాహనాన్ని ఆపారు. తీవ్ర గాయాలపాలైన ఇరువురిని తన ఎస్కాట్ వాహనంలో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి మానవత్వం చాటుకున్నారు.

మిర్యాలగూడలో పాలస్తీనా జెండాల ప్రదర్శన

- సోషల్ మీడియాలో వైరలైన దృశ్యాలు
- యువకులను అదుపులోకి తీసుకున్న పోలీసులు


పాలస్తీనా జెండాలను ప్రదర్శిస్తున్న యువకులు

మిర్యాలగూడ అర్బన్: గణతంత్ర దినోత్సవం సందర్భంగా మిర్యాలగూడ పట్టణంలో కొందరు యువకులు పాలస్తీనా దేశానికి చెందిన జెండాలు ప్రదర్శించారు. నలుగురు(విద్యార్థులు) యువకులు మిర్యాలగూడ పట్టణంలోని బ్లూ వెల్ ప్యాలెస్ భవనం మెట్లపై నిలబడి పాలస్తీనాకు చెందిన రెండు జెండాలను పట్టుకుని ప్రదర్శించారు. వారు ప్రదర్శిస్తున్న సమయంలో తమ స్నేహితులతో వీడియో, ఫొటోలు తీయించుకున్నారు. ఆ సమయంలో సమీపంలో కొందరు యువకులు ఆ దృశ్యాలను వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు. విషయం తెలుసుకున్న వన్‌టౌన్ సీఐ రాఘవేందర్ సంఘటనా స్థలానికి చేరుకుని నలుగురు యువకులను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. డీఎస్పీ వెంకటగిరి యువకులను విచారిస్తున్నారు. ఒక వైపు గణతంత్ర వేడుకల్లో పట్టణ వాసులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు ఉండగా అదే సమయంలో యువకులు పాలస్తీనా జెండాలను ప్రదర్శించడం చర్చనీయాంశంగా మారింది. పాలస్తీనా జెండాలు ప్రదర్శించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి చిలుకూరి శ్యామ్ డిమాండ్ చేశారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యం


విద్యార్థినులతో కలిసి మధ్యాహ్న భోజనం చేస్తున్న ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

భువనగిరిటౌన్: గణతంత్ర దినోత్సవం సందర్భంగా శుక్రవారం భువనగిరి పట్టణంలోని హుస్నాబాద్ కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాన్ని ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి సందర్శించి విద్యార్థినుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషిచేస్తానని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో నిర్వీర్యమైన ప్రభుత్వ విద్యా వ్యవస్థను కాంగ్రెస్ ప్రభుత్వం గాడిలో పెట్టి పేద విద్యార్థులకు అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైతు వ్యవసాయ క్షేత్రంలో గణతంత్ర వేడుకలు


తమ వ్యవసాయ క్షేత్రంలో జాతీయ పతాకాన్ని ఎగురవేస్తున్న రజితారెడ్డి దంపతులు

చౌటుప్పల్: మండల పరిధిలోని పెద్ద కొండూరు గ్రామ పంచాయతీ మదిర తమ్మలోనిబావి గ్రామానికి చెందిన ఆదర్శ మహిళా రైతు వాకిటి రజితారెడ్డి శుక్రవారం తన వ్యవసాయ క్షేత్రంలో గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తన భర్త వాకిటి రాజేందర్‌రెడ్డితో కలిసి ఆమె జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఈ వేడుకలకు గ్రామ సర్పంచ్ కాయితి రమేష్‌గౌడ్, ఎంపీటీసీ సభ్యుడు బద్దం కొండల్‌రెడ్డితో పాటు గ్రామ ఉప సర్పంచ్ జక్కిడి జయమ్మఅంజిరెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్ దూర్క కృష్ణ, మాజీ సర్పంచ్ బద్దం పాండురెడ్డి తదితరులు హాజరయ్యారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత.. కేసు నమోదు

మోత్కూరు: మండలంలోని పాడిచేడు గ్రామ పరిధిలో మూసీ వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు శుక్రవారం ఎస్ఐ ఏమిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. పాడిచేడు గ్రామానికి చెందిన నర్రె మహేష్ తన ట్రాక్టర్ డ్రైవర్ బండ నవీన్‌తో కలిసి మూసీ వాగు నుంచి ఇసుక తరలిస్తున్నారనే సమాచారం మేరకు అనాజిపురం గ్రామంలో ట్రాక్టర్‌ను పట్టుకొని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

గాంధీజీ, శివుడి విగ్రహాలు ఏర్పాటు


శివుడి విగ్రహానికి పూజలు చేస్తున్న నాయకులు

భువనగిరి రూరల్: మండలంలోని వడాయిగూడెం గ్రామంలో శుక్రవారం మహాత్మా గాంధీ, వైకుంఠధామంలో శివుడి విగ్రహాలను ఏర్పాటు చేశారు. కల్లెం కృష్ణాగౌడ్ తండ్రి కల్లెం సత్తయ్యగౌడ్ జ్ఞాపకార్థం శివుడి విగ్రహం, గాంధీజీ విగ్రహాలను ఏర్పాటు చేసిన దాత ముద్దసాని వెంకటేశ్ గౌడ్‌ను సర్పంచ్ గుండు మనీష్‌గౌడ్ సన్మానించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ నీల పోశెట్టి, బబ్బూరి సాగర్, పబ్బాల మాధవి, శక్తి సంతోష, పబ్బాల రమేష్, కోట పోచయ్య, కల్లెం కృష్ణాగౌడ్, ఏశబోయిన లక్ష్మి, కోట స్వామిదాసు, గుండు ముత్తయ్యగౌడ్, జక్కుల చంద్రయ్య యాదవ్, చుక్కల సత్యనారాయణ, బబ్బూరి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రామానంద ప్రభూజీకి ఘన స్వాగతం


ప్రభూజీకి స్వాగతం పలుకుతున్న భక్తులు

బొమ్మలరామారం: అయోధ్యలో ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవానికి హాజరై వచ్చిన బొమ్మలరామారం మండలం పెద్ద పర్వతపూర్ గ్రామంలో గల సాయిధామం పీఠాధిపతి శ్రీరామానంద ప్రభూజీకి మండల ప్రజలు శుక్రవారం ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రభూజీ భక్తులకు అయోధ్య నుంచి తీసుకువచ్చిన సరయూ నది జలాలు, తీర్థ ప్రసాదాలను అందజేశారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

మునగాల(కోదాడ): గుర్తుతెలియని వ్యక్తులు తాళం వేసిన ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. మండల పరిధిలోని ఎస్ఎంపేట గ్రామానికి చెందిన మందపల్లి అరుణ్‌కుమార్ వ్యాపారం నిమిత్తం ఖమ్మం పట్టణంలో ఉంటున్నాడు. శుక్రవారం అరుణ్‌కుమార్ ఇంటి తలుపులు తెరిచి ఉండడంతో స్థానికుల సమాచారం మేరకు అతడు వచ్చి చూడగా రెండున్నర తులాల బంగారు, 12తులాల వెండి ఆభరణాలు, సెల్‌ఫోన్ చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.